క్లుప్తంగా

హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా రమణబాబు


రమణబాబు

చింతపల్లి: మండల హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా కె.రమణ బాబు బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ సాయి ఉద్యోగానికి రాజీనామ చేశారు. దీంతో ఏఈ పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉంది. దీంతో జిల్లా హౌసింగ్ అధికారులు సీనియర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణ బాబుని హౌసింగ్ ఏఈగా నియమించారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

బాణసంచా అమ్మకాలకు అనుమతులు తప్పనిసరి


ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయదారులు సామగ్రి నిల్వలు, అమ్మకాలు జరపాలన్నారు. దుకాణాల ఏర్పాటుకు ముందుగా నిబంధనలు ప్రకారం పోలీసుల అనుమతులు పొందాలన్నారు. విక్రయదారులు ప్రభుత్వ ఆదేశాలను విధిగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వలు, విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు క్రాస్ కంట్రీ పోటీ

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రా యూనివర్సిటీ స్థాయి క్రాస్ కంట్రీ పోటీ మంగళవారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్‌కుమార్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలలోని క్రీడాకారులు ఈవెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన సెలక్షన్ కమిటీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు పాల్గొవాలని కోరారు.

గంజాయి అనర్థాలపై అవగాహన

కొయ్యూరు: మండలంలోని నడింపాలెం, అంతాడ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు గంజాయి అనర్థాలపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. గదబపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీవో విజయకుమారి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో స్థానిక మహిళలతో కలిసి గంజాయి అనర్థాలపై అవగాహన ర్యాలీలు చేయాలన్నారు. గంజాయితో పాటు సారా వలన కలిగే నష్టాలను వివరించాలని కోరారు. పిల్లల ఎత్తు, బరువులను విధిగా నమోదు చేయాలన్నారు. సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట


పూజల్లో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం: మండలంలోని బోర్నగూడెం గ్రామంలోని కోదండ సీతారామాలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ దాతలు రమణ, సాంబమూర్తి, భాస్కరమణిల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కమిటీ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకటరామరెడ్డి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నట్టు వారు చెప్పారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

జి.మాడుగుల: మండల కేంద్రంలోని సీపీఎం నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మండల పార్టీ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. పార్టీ అధ్యక్షుడిగా ఎస్.ధర్మన్న పడాల్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ గెమ్మెలి పంచాయతీ పరిధిలోని మహదేవపురం, ఊడపాలెం, మద్దులబంధ గ్రామాల్లో ఎర్రమట్టి తవ్వకాలకు కూటమి ప్రభుత్వం సిద్ధం చేస్తోందని, దీన్ని వ్యతిరేకించేందుకు గ్రామస్తులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ తరఫున ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. సన్యాసిదొర, ధర్మారావు, పిన్నంనాయుడు, సత్తిబాబు, గణపతి, మత్స్యంనాయుడు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అరకొర వైద్యం.. ఆందోళనలో గిరిజనం


ముంచంగిపుట్టు సీహెచ్‌సీ

- సీహెచ్‌సీకి పెరిగిన రోగుల తాకిడి
- రోజూ 200 పైగా నమోదవుతున్న ఓపీ
- వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న వ్యాధులు
- సీహెచ్‌సీలో వైద్యుల కొరత


ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో బారులుతీరిన రోగులు


వార్డులో రోగులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో వైద్య సేవల పరిస్థితి దయనీయంగా ఉంది. ఆస్పత్రిలో వైద్యుల కొరత వెంటాడుతోంది. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల రోగాలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. దీంతో సీహెచ్‌సీలో ఓపీ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆస్పత్రిలో వైద్యులు తక్కువగా ఉండడంతో రోగులు గంటల తరబడి వైద్య సేవల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వ్యాధుల బారిన గిరిజనులతో ఆరోగ్య కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సోమవారం ఓపీ 167గా నమోదైంది. గత వారం రోజుల్లో 1,526 మంది సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందినట్టు రికార్డులో నమోదైంది. ఆస్పత్రి ప్రాంగణం రోగులతో కిక్కిరిసిపోతుంది. ఇక్కడ రక్తపరీక్షల గది వద్ద కూడా రోగులు బారులు తీరుతున్నారు.

అంతంతమాత్రంగా సేవలు

మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో వైద్యుల కొరత నెలకొంది. సీహెచ్‌సీలో 8 మందికి గాను కేవలం ముగ్గురే వైద్యులు ఉన్నారు. ఇందులో ఒకరు డెంటిస్ట్ కాగా, మిగిలిన ఇద్దరు జనరల్ వైద్యులు. దీంతో ఓపీ చూడడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడి సీహెచ్‌సీలో రోజూ 200 నుంచి 250 వరకు ఓపీ నమోదవుతుంది. అయితే శనివారం మండల కేంద్రంలో వారపు సంత కావడంతో ఓపీ 300లకు పైగా దాటుతుంది. దీంతో తప్పనిసరి పరిస్థితిలో డెంటిస్ట్ కూడా ఓపీ చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రికి ఉదయం వచ్చే రోగులు మధ్యాహ్నం వరకు ఓపీ క్యూలైన్ లోనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. సుదూరం నుంచి వచ్చిన తమకు ఆస్పత్రిలో వైద్య సేవల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రక్త పరీక్ష గది వద్ద రోగులు

మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వైద్యుల నియామకానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



సీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు రోగుల సంఖ్య పెరుగుతూ ఉంది. వైద్యులు విధులు నిర్వహించడం చాలా కష్టంగా మారుతుంది. సీహెచ్‌సీలో వైద్యుల కొరత సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ నేటికి ఖాళీలను భర్తీ చేయలేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే పూర్తి స్థాయి వైద్యులను నియమించాలి.

– వెంగడ రమేష్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, ముంచంగిపుట్టు

పోస్టుల భర్తీకి చర్యలు



సీహెచ్‌సీలో వైద్యుల కొరత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆస్పత్రిలో రోజూ రోగుల సంఖ్య పెరుగుతూ ఉన్నా ముగ్గురు వైద్యులతో పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నాం. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మరో అయిదుగురు వైద్యులను నియమించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో వైద్యుల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సీహెచ్‌సీలో 8 మంది వైద్యులను త్వరలోనే నియమించనున్నారు.

– కె.గీతాంజలి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, ముంచంగిపుట్టు

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర


పెద్దపుట్టులో బోరు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చెప్పారు. మండలంలో పలు గ్రామాలను ఆమె సోమవారం సందర్శించారు. ఇందులో భాగంగా మండలంలోని పెదగూడ పంచాయతీ గలగండ గ్రామంలో జెడ్పీ, ఎంపీపీ నిధులు రూ.20లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు, కించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టు గ్రామంలో జెడ్పీ నిధులు రూ.1.40లక్షలతో బోరు నిర్మాణ పనులకు ఆమె సోమవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఏజెన్సీలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, గిరిజనుల సమస్యలు తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. జెడ్పీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు మంజూరు చేస్తున్నామన్నారు. మండలంలోని 23 గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి జెడ్పీ నిధులు రూ.30లక్షలు కేటాయించి, బోర్లు వేయించినట్టు చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చాలా గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరగడంతో గిరిజనుల కష్టాలు తీర్చగలిగామన్నారు. రానున్న రోజుల్లో జెడ్పీ నిధులతో గిరిజన ప్రాంతాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాడేరు డివిజన్‌లో 11మండలాల్లో 1,350 గ్రామాలు నేటికి అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం గ్రామాల్లో గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీపీ సీతమ్మ, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచులు బాబూరావు, గంగాధర్, నీలకంఠం, సుభాష్‌చంద్ర, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, గణపతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నాయకులు సన్యాసిరావు, తిరుపతి, మూర్తి, తిరుపతిరావు తదితరులున్నారు.

అక్షరాస్యత పెంపునకు కృషి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యదర్శులు, వెలుగు శాఖ సిబ్బందితో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతను పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అక్షరాస్యత పెంపునకు ప్రభుత్వం అమలుచేస్తున్న ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వెలుగు శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పలు సూచనలిచ్చారు. ఈవోపీఆర్డీ పాపారావు, వెలుగు ఏపీఎం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం దారుణం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: పెదవలస గ్రామ పంచాయతీకి చెందిన కొందరు నాయకులు తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం కన్నతల్లి లాంటి వైఎస్సార్‌సీపీని వీడడం దారుణమని, దీన్ని ప్రజలు హర్షించరని నాయకులు స్పష్టం చేశారు. పెదవలసలో వైస్ ఎంపీపీ దేముడు, నాయకులు కంకిపాటి గిరిప్రసాద్, రమేష్, శ్రీరాములు, రామారావు తదితరులు సోమవారం సమావేశమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మన్యంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. అందుకే మన్యంలో వరుసగా మూడోసారి వైఎస్సార్‌సీపీనే ప్రజలు గెలిపించారన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తించాలన్నారు. కేవలం కొందరు నాయకులు పార్టీని వీడినంత మాత్రాన వైఎస్సార్‌సీపీకి ఎటువంటి నష్టం లేదన్నారు. నాయకులు శరభన్నపదాల్, మంగమ్మ, రాంబాబు సీతమ్మ, సత్తిబాబు బాలరాజు, బొజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష


పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఎల్. యాదగిరీశ్వర్రావు సోమవారం వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు, బయోమెట్రిక్ హాజరు అమలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ, పన్నులు, పింఛన్లు మంజూరు కాని అర్హుల వివరాలపై సమీక్ష సమావేశంలో చర్చించారు. పంచాయతీ విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ వెంకయ్య తదితరులు

అడ్డతీగల: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వంగలమడుగులో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసుశాఖ ముందుంటుందని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు పొందలేని వారికి వైద్య శిబిరాల వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. యవత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి పోలీసుశాఖ చేయూత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. దుశ్చర్తి ఎస్‌ఐ వెంకయ్య, దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

చట్టాలు పటిష్టంగా అమలుచేయాలని వినతి

పాడేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలను పక్కాగా అమలుచేయాలని ఆదివాసీ మహాసభ జిల్లా అధ్యక్షురాలు ఎం.మాధురి డిమాండ్ చేశారు. ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం పాడేరు పాత బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గిరిపుత్రులకు మెరుగైన జీవనోపాధిని పెంచి వారికి మరింత రక్షణ కల్పించేందుకు రూపొందించిన అటవీ హక్కుల చట్టంతో పాటు పీసా చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయడం లేదన్నారు. ఆదివాసీ మిత్ర సీఈవో మన్మథరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఆదివాసీలకు 150 రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉండగా కేవలం 100 రోజుల పనినే కేటాయిస్తున్నారని ఆరోపించారు. గిరిజన చట్టాలు, హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు పునఃసమీక్ష నిర్వహించి, సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరారు. అనంతరం ఐటీడీఏ అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సన్నిబాబు

పెదబయలు: కూటమి ప్రభుత్వం గ్రామ వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొండా సన్నిబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో వలంటీర్ల సంఘం, సీఐటీయూ అనుబంధ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పథకాన్ని లబ్ధిదారులకు అందేలా గ్రామ వలంటీర్లు పనిచేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు గౌరవవేతనం ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారని, అధికారం చేపట్టి నాలుగు నెలలు పైబడినా హామీ అమలుచేయలేదన్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో 260 మంది గ్రామ వలంటీర్లుగా పనిచేసేవారని, వారిని విధుల్లోకి తీసుకొని కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే గ్రామస్థాయి నుంచి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో సమగ్ర భూసర్వే


మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యారావు

రాజవొమ్మంగి: గ్రామాల వారీగా సమగ్ర భూ సర్వే జరుగుతోందని, ఈ ప్రక్రియ వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు కొనసాగుతోందని తహసీల్దార్ కె.సూర్యారావు చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేలో ఇద్దరు వీఆర్వోలు, ముగ్గురు సర్వేయర్లు ఉంటారన్నారు. మండలంలోని దోనెలపాలెం, సింగంపల్లి, ఉర్లాకులపాడు, కరుదేవపాలెం, వణకరాయి గ్రామాల్లో ఈనెల 24న ఈ సర్వే ప్రారంభం కాగా, నవంబర్ 7వతేదీ వరకు జరుగుతుందన్నారు. అలాగే నవంబర్ 8 నుంచి 21వ తేదీ వరకు లాగరాయి, ముంజవరప్పాడు, మారేడుబాకలో, 22 నుంచి డిసెంబర్ 4 వరకు తంటికొండ, గొబ్బిలమడుగు, శరభవరం, ఓగిపాలెం గ్రామాల్లో, డిసెంబర్ 5 నుంచి 18 వరకు కొండపల్లి, అనంతగిరి, చికిలింత, బలిజపాడులో, డిసెంబర్ 19 నుంచి నెలాఖరు వరకు దమనపాలెం, ఓకుర్తి, నెల్లిమెట్ల గ్రామాల్లో, జనవరి 2 నుంచి 18వ తేదీ వరకు దూసరపాము, కేశవరం, వాతంగి, కింద్ర గ్రామాల్లో, జనవరి 20 నుంచి 31వ తేదీ వరకు కొమరాపురం, అమీనాబాద్, రాజవొమ్మంగి, జడ్డంగి గ్రామాల్లో ఈ సర్వే కొనసాగుతుందన్నారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు


ఉత్తమవిద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు బహుమతులు అందజేశారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల (1992 బ్యాచ్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన తోలాటి జ్యోతి, అయినవిల్లి ఆనంద్, మన్నేపల్లి స్నేహలత, అపూర్వ సుప్రియలకు వెయ్యి రూపాయల నగదు, మెమెంటో, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. సబ్జెక్టుల వారీగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు మూర్తి, శివకృష్ణ, ఉదయ్, రాజమ్మ, పూర్వ విద్యార్థులు కె.శ్రీనివాసశర్మ, నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు ఉపాధి పనులు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: మండలంలోని 23 గ్రామాల్లోని గిరిజనులకు సాంకేతిక సమస్య కారణంగా జాబ్‌కార్డులు పొందలేకపోవడంతో వారంతా చాలా కాలంగా ఉపాధి పనులకు దూరమయ్యారు. దీనిపై వారు స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన కలెక్టర్, ఐటీడీఏ పీవోలు ఈ సమస్యను పరిష్కరించారు. ఆయా గ్రామాల్లో అర్హులైన గిరిజనులకు ఉపాధి పనులు కల్పించారు. తమ సమస్యను పరిష్కరించిన కలెక్టర్, ఐటీడీఏ పీవోకు ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు పొందిన గిరిజనులు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గిరిజన విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చింతపల్లి: మండలంలోని జాజులుపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. హిందూపూర్‌లో ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో జాజులుపాలెం పాఠశాల విద్యార్థి వంతల సంతోష్, అండర్–14 విభాగంలో మర్రి చిట్టిబాబులు ఉత్తమ ప్రతిభ చాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు హెచ్‌ఎం కె.ప్రసాదరావు చెప్పారు. ఈ మేరకు పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను హెచ్‌ఎం ప్రసాదరావు, పీడీ జోసెఫ్, డిప్యూటీ వార్డెన్ సూకేష్, పాఠశాల సిబ్బంది తదితరులు అభినందించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు


పాడేరులో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో సరస్వతిదేవి


డుంబ్రిగుడలో సూచనలిస్తున్న ఏఎంవో భాస్కరరావు



పెదబయలులో మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య, ఎంఈవో పుష్ప

పాడేరు: పట్టణంలోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు బేస్‌లైన్ మొదటి విడత శిక్షణ తరగతులను ఎంఈవో సీహెచ్.సరస్వతిదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కె.ప్రసాద్, ఎస్.వెంకటగిరి, శెట్టి శాంతి, పద్మ రీసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు.

పెదబయలు: మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్‌లో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు బేస్‌లైన్ శిక్షణ తరగతులను ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, ఎంఈవో పుష్ప సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని సూచించారు. హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, సతీష్, సీఆర్పీలు మత్స్యరాజు, ఉపేంద్ర, మోదలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని ఏఎంవో భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభ పద్ధతిలో బోధనతో ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. చిన్నారుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు సులువు పద్ధతిలో బోధన ఎంతగానో దోహదపడుతుందన్నారు. బేస్‌లైన్ శిక్షణలో తెలుసుకున్న అంశాలను పాఠశాలల్లో అమలుచేయాలని ఆయన కోరారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం సునీత, సీఆర్పీలు నాగేంద్ర, సింహబలుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సర్వే


సీలేరులో సర్వే చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సీలేరు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో అయిదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల గణన సర్వేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు మాట్లాడుతూ అయిదేళ్లలోపు చిన్నారులకు వచ్చే ప్రాణాంతక వ్యాధుల నిరోధకానికి ఇచ్చే టీకాల గణన సర్వే చేపడుతున్నామన్నారు. ఇందులో టీకాలు అందని చిన్నారులను డ్రాప్ అవుట్‌గా గుర్తించినట్టు చెప్పారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో చిన్నారులకు టీకాలు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాల సర్వే కూడా నిర్వహించినట్టు చెప్పారు. దోమల మందు పిచికారీ తదితర వివరాలను గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకున్నామన్నారు. పీహెచ్‌సీ సబ్ యూనిట్ ఆఫీసర్ కన్నబాబు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.